సాక్షి ఖమ్మం

గురువారం । 29 । ఆగస్టు । 2024



అమ్మో.. ఒంటి నొప్పులు..

జిల్లాలో పలువురు విషజ్వరాల బారిన పడగా, ప్రస్తుతం జ్వరం తగ్గినా తీవ్రమైన నొప్పులతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. 8లో



అందరికీ రుణమాఫీ చేయాలి

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆంక్షలు లేకుండా అర్హులందరికీ రుణమాఫీ చేయాలని రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. 8లో



వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు పడొచ్చు. మధ్యాహ్నం తర్వాత ఎండ ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

పెండింగ్ పనులు సత్వరమే పూర్తిచేయాలి

- డీఆర్డీఓ సన్యాసయ్య



కూసుమంచి పాఠశాలలో కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీఓ

కూసుమంచి : అమ్మ ఆదర్శ పథకంలో భాగంగా పాఠశాలల్లో చేపట్టిన పనులేమైనా పెండింగ్‌లో ఉంటే సత్వరమే పూర్తి చేయాలని డీఆర్డీఓ సన్యాసయ్య సూచించారు. బుధవారం ఆయన మండలంలోని కేశ్వాపురం, చేగొమ్మ, కూసుమంచి ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనుల్లో వేగం పెంచాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో న్యూట్రీ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన తయారీని తనిఖీ చేసి నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కూసుమంచి ఉన్నత పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన స్త్రీ శక్తి హోటల్‌ను ప్రారంభించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్, పీఆర్ డీఈఈ వంశీ, ఏఈ కిషోర్, ఈజీఎస్ ఏపీఓ అప్పారావు, ఐకేపీ ఏపీఎం సత్యవర్ధన్ రాజు పాల్గొన్నారు.

దక్షిణాది రాష్ట్రాల్లో రైతు నేతల పర్యటన

ఖమ్మంవ్యవసాయం : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేసేందుకు జాతీయ రైతు నాయకుల బృందం దక్షిణాది రాష్ట్రాల్లో పర్యటిస్తోంది. ఈ క్రమంలో బుధవారం తమిళనాడులోని తిరుచ్చి, పుదుచ్చేరి, కేంద్రపాలిత ప్రాంతమైన కాలైకర్‌లో రైతు సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి హాజరైన జిల్లాకు చెందిన రైతు నేత నల్లమల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని విమర్శించారు. పంటలకు మద్దతు ప్రకటించాలని, చట్ట భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 15న హరియాణాలో రైతు మహా పంచాయత్, భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి దక్షణాది రాష్ట్రాల నుంచి కూడా రూతులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకులు లక్విందర్ సింగ్(హరియాణా), అమర్జిత్ సింగ్(పంజాబ్), శాంత కుమార్(కర్ణాటక), పాండ్యన్(తమిళనాడు), సుధ(పుదుచ్చేరి) తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంసహకారనగర్: కాకతీయ యూనివర్సిటీ అనుబంధ నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ తెలుగు, ఎంకామ్ కోర్సుల్లో ఒక్కొక్క విభాగంలో 60 సీట్ల చొప్పున ఖాళీలు ఉన్నాయని, ఇటీవల జరిగిన పీజీ ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 27 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లలో తమ కళాశాలను మొదటి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

మూతబడినవి

ప్రభుత్వ విద్య నానాటికీ మసకబారుతోంది. అన్ని వసతులు కల్పిస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పలు సమస్యలు వేధిస్తుండటంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతుండగా మూతపడుతున్న పాఠశాలల సంఖ్య పెరుగుతోంది. ఇటీవల విద్యాశాఖపై సమీక్షించిన సీఎం రేవంత్‌రెడ్డి.. విద్యార్థులు లేరనే సాకుతో స్కూళ్లు మూసేయొద్దని, ఆ సంఖ్యతో సంబంధం లేకుండా నడిపించాలని ఆదేశించారు. అయితే జిల్లాలో ఇప్పటివరకు విద్యార్థులు లేరనే కారణంతో 62 పాఠశాలలు మూతపడ్డాయి. వీటిని వచ్చే విద్యాసంవత్సరం అయినా తెరిపించి విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య పెంచితేనే ప్రభుత్వ విద్య మనగలుగుతుంది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం



మూడేళ్ల క్రితం మూత

నేలకొండపల్లి మండలం మోటాపురం (బీల్యా తండా) ప్రాథమిక పాఠశాలను మూడేళ్ల క్రితం మూసేశారు. ఈ స్కూల్‌లో ముగ్గురు విద్యార్థులుండగా వారిని కిలోమీటర్ దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలకు పంపారు. అక్కడ పని చేసే ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌కు అదే స్కూల్‌లో డిప్యూటేషన్ వేశారు. ప్రస్తుతం బీల్యాతండాలో పాఠశాల లేకపోవడంతో గత మూడేళ్లుగా ఆ గ్రామానికి చెందిన విద్యార్థులు కొందరు ప్రైవేట్ స్కూళ్లలో, మరి కొందరు నేలకొండపల్లి, ఖమ్మం లోని ప్రభుత్వ హాస్టళ్లలో చేరారు. ఈ పాఠశాలను పునః ప్రారంభిస్తే విద్యార్థుల సంఖ్య గతం కంటే పెరిగే అవకాశం ఉంది.



తాళం వేసి ఉన్న బీల్యాతండా పాఠశాల

ఆ స్కూళ్లు తిరిగి తెరుచుకునేనా?

- ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- ఉపాధ్యాయుల కొరత, ఇతర కారణాలతో ప్రైవేట్‌కే మొగ్గు
- విద్యాశాఖపై ప్రభుత్వం దృష్టి సారిస్తేనే ఫలితాలు
- బడిబాట నిర్వహిస్తున్నా ప్రయోజనం అంతంతే..
- జిల్లాలో ఇప్పటివరకు 62 పాఠశాలలు మూత

ఇంకా పెరగని నమ్మకం..

ఉన్నత విద్యార్హతలు గల ఉపాధ్యాయులు, పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు, డిజిటల్ విద్యావిధానం, ఇంగ్లిష్ మీడియం బోధన అంటూ ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు ప్రభుత్వ పాఠశాలలను వేధిస్తున్నాయి. ఈ క్రమంలో వీటిపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో నమ్మకం కలగడం లేదు. కొన్ని పాఠశాలల్లో ఇప్పటికీ ఒకే టీచర్ ఉంటున్నారు. ఏమైనా సమావేశాలు, ఇతర పనులు ఉంటే ఆ ఒక్క టీచర్ రాకుంటే బడికి ఇక సెలవే. ఇలాంటి కారణాలతో తల్లిదండ్రుల అడుగులు ప్రైవేట్ పాఠశాలల వైపు పడుతున్నాయి. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే తల్లిదండ్రుల సంఖ్య వేళ్లపై లెక్కించవచ్చు. ఉపాధ్యాయులు లేరనే కారణంతో విద్యార్థులు చేరకపోగా.. విద్యార్థులు లేరనే సాకుతో పాఠశాలలు మూతపడుతున్నాయి.

సౌకర్యాల కొరత..

జిల్లాలో 1,216 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో చాలా స్కూళ్లలో ఇప్పటికీ సరైన సౌకర్యాలు లేవు. టాయిలెట్స్, తాగునీటి వసతి అధ్వానంగా ఉండడంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. గత ప్రభుత్వ హయాంలో 'మన ఊరు–మన బడి' పేరుతో పాఠశాలల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టినా.. మొదటి విడత కూడా పూర్తి కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో పనులు చేపట్టారు. అయితే ఈ విద్యా సంవత్సరంలో 50 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. స్కూళ్లకు అవసరమైన కొత్త భవనాలు నిర్మించే పరిస్థితి లేదు. వరుస ఎన్నికల నేపథ్యంలో పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి.

బడిబాట అంతంతే..

ప్రతి ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలో డ్రాపౌట్స్‌ను మళ్లీ బడిలో చేర్పించేందుకు బడిబాట కార్యక్రమం ఏర్పాటు చేస్తుంటారు. ప్రతి ఏడాది ఇది మొక్కుబడి కార్యక్రమంగా మారుతోంది. ఉపాధ్యాయులు, స్థానికులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి నచ్చజెప్పినా.. తల్లిదండ్రులు వినే పరిస్థితి లేదు. అయితే పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కమిటీలను నియమించాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు సూచిస్తున్నారు. దీనివల్ల విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేందుకు కార్యాచరణ రూపొందుతుందని, తల్లిదండ్రులకు అవగాహన కల్పించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

ఈ బడులు తెరిస్తేనే..

జిల్లాలో దాదాపు 62 పాఠశాలలు మూతపడ్డాయి. ఇవి తెరిస్తేనే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చదువు దరి చేరుతుంది. ప్రధానంగా ఉపాధ్యాయుల నియామకం చేపట్టి మూతపడిన పాఠశాలలను తెరిస్తే ఉపయుక్తంగా ఉంటుంది. పాఠశాలలను మూసిన సమయంలో అక్కడ చదువుతున్న విద్యార్థులను మరో పాఠశాలకు పంపించారు. అయితే ఆ బడి దూరంగా ఉందనో.. మరో కారణంగానో ఆయా విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చేరుతున్నారు. దీంతో విద్యార్థుల సంఖ్య మరింతగా తగ్గుతోంది. 2023 – 24లో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 82,223 మంది ఉండగా.. ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ పాఠశాలల విద్యార్థులు 87,796 మంది ఉన్నారు. ఇక 2024 – 25లో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 84,363 మంది ఉండగా.. ప్రభుత్వ ప్రభుత్వ అనుబంధ పాఠశాలల విద్యార్థుల సంఖ్య 83,296కు చేరింది. గతేడాదితో పోలిస్తే ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల సంఖ్య పెరగ్గా.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య తగ్గింది.

వచ్చే ఏడాది నుంచి ప్రారంభిస్తాం



మూతబడిన పాఠశాలలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి తెరిపించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. జిల్లాలో మూతబడిన పాఠశాలలపై ప్రభుత్వానికి నివేదిక అందజేశాం. ప్రభుత్వం ఇచ్చే మార్గదర్శకాలను అనుసరించి చర్యలు తీసుకుంటాం.

– ఈ.సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య వివరాలు..

పాఠశాల	సంఖ్య	విద్యార్థులు
ప్రభుత్వ, లోకల్‌బాడీ	1,216	60,136
ప్రభుత్వ ట్రైబల్‌వెల్ఫేర్ ప్రైమరీ	15	320
కేజీబీవీ	14	4,207
రెసిడెన్షియల్ స్కూల్స్	55	18,633
ప్రైవేట్ స్కూల్స్	306	84,363
	1,606	1,67,659

జిల్లాలో విద్యార్థులు లేక మూతపడిన పాఠశాలలు

మండలం	పాఠశాలలు	కల్లూరు	10
సింగరేణి	04	పెనుబల్లి	07
కామేపల్లి	05	సత్తుపల్లి	02
రఘునాథపాలెం	03	వేంసూరు	02
ఖమ్మంరూరల్	02	తల్లాడ	05
తిరుమలాయపాలెం	06	వైరా	02
నేలకొండపల్లి	02	మధిర	04
ముదిగొండ	02	ఎర్రుపాలెం	03
ఏన్కూరు	02	కూసుమంచి	01

తొలిరోజు 1,475 కుటుంబాల నిర్ధారణ

ఖమ్మంవ్యవసాయం: రుణమాఫీ వర్తించని రైతు కుటుంబాల నిర్ధారణ ప్రక్రియ బుధవారం ప్రారంభం కాగా, జిల్లాలో తొలిరోజు 1,475 కుటుంబాల వారిని వ్యవసాయ శాఖ గుర్తించింది. రేషన్ కార్డులు లేకున్నా రుణమాఫీకి అర్హులైన రైతుల జాబితాలను నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్(ఎన్ఐసీ) మండలాల వారీగా నేరుగా వ్యవసాయ శాఖ అధికారులకు పంపించింది. ఆ జాబితాల ఆధారంగా కుటుంబ సభ్యుల నిర్ధారణ ప్రక్రియను వ్యవసాయ శాఖ చేపట్టింది. ఈ మేరకు వ్యవసాయాధికారులు గ్రామాల వారీగా ప్రణాళికలు రూపొందించారు. ఏఈఓల సహకారంతో గ్రామాల్లో టంకాలు, మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో కుటుంబ సభ్యుల నిర్ధారణ ప్రక్రియ ఎప్పుడు నిర్వహించేది ముందుగానే ప్రకటిస్తున్నారు. నిర్ధారణ ప్రక్రియలో భాగంగా అధికారులు కుటుంబ యజమాని నుంచి అఫిడవిట్ తీసుకొని, ఆ కుటుంబంతో సెల్ఫీ ఫొటో దిగి ప్రభుత్వం రూపొందించిన 'రైతు భరోసా' పంట రుణాల పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. జిల్లాలో 50 వేల రైతు కుటుంబాల జాబితాను ఎన్ఐసీ పంపించగా.. నిర్ధారణ ప్రక్రియను వ్యవసాయ శాఖ చేపట్టాల్సి ఉంది. ఒక్కో మండల వ్యవసాయాధికారి రోజుకు 100 కుటుంబాల చొప్పున సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

అర్హులందరికీ రుణ మాఫీ

- జిల్లా వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య
- రఘునాథపాలెం, కామేపల్లి మండలాల్లో సర్వే పరిశీలన



కామేపల్లిలో రైతు కుటుంబాన్ని సెల్ఫీ తీస్తున్న ఏఓ, చిత్రంలో డీఏఓ పుల్లయ్య

రఘునాథపాలెం/కామేపల్లి : అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య అన్నారు. బుధవారం ఆయన రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం, కామేపల్లి రైతు వేదికలో రుణమాఫీ వర్తించని రైతు కుటుంబాల నిర్ధారణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తప్పులు దొర్లడం వల్ల కొందరు అర్హులైన వారికి రుణమాఫీ కాలేదని, ఇప్పుడు వివరాల సేకరణ తర్వాత వారికీ మాఫీ వర్తిస్తుందని చెప్పారు. అధికారులు చేపట్టే సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. రుణమాఫీ వర్తించని రైతులు ఆందోళన చెందొద్దని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఏడీఏ కొంగర వెంకటేశ్వర్లు, ఏఓలు ఉమా మహేశ్వర్‌రెడ్డి, తారాదేవి, ఏఈఓలు బాలబత్తుల శిరణ్మయి, శ్రీకన్య, రవికుమార్, వీవీపాలెం పీఏసీఎస్ వైస్ చైర్మన్ రావెళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో నాణ్యమైన విద్య

- అంబేడ్కర్ వర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభం
- యూనివర్సిటీ డీన్ శ్రీనివాస్ వడ్డాణం



మాట్లాడుతున్న డీన్ శ్రీనివాస్ వడ్డాణం

ఖమ్మం సహకారనగర్ : బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో విద్య అందరికీ అందుబాటులో ఉంటుందని, ఇక్కడ విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని యూనివర్సిటీ దృశ్య శ్రవణ మాధ్యమం పరిశోధన, అభివృద్ధి కేంద్ర డైరెక్టర్, డీన్ ప్రొఫెసర్ శ్రీనివాస్ వడ్డాణం అన్నారు. నగరంలోని ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ (యూజీ) బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో, పీజీ ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, బీఎల్ఐఎస్, ఎంఎల్ఐఎస్ తదితర డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 31 వరకు అవకాశం ఉందని, ఆసక్తిగల అభ్యర్థులు ప్రవేశాలు పొందాలని సూచించారు. రెగ్యులర్ డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సులు చేయలేని విద్యార్థులకు, గృహిణులకు, ఉద్యోగులు, వ్యాపారులకు, జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలనుకునే వారందరికీ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉపయోగపడుతుందని తెలిపారు. యూనివర్సిటీ నాక్ – ఎ గ్రేడ్ సాధించిందని, డిగ్రీ కోర్సులు సెమిస్టర్ సిస్టంలో, పీజీ కోర్సులు ఇయర్ వైజ్ స్కీంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. కాంటాక్ట్ తరగతులతో పాటు స్టడీ మెటీరియల్ అందజేస్తున్నామని అన్నారు. www.braouonline.in; www.braou.ac.in వెబ్‌సైట్‌లో వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు ఈనెల 31 లోపు ట్యూషన్ ఫీజు చెల్లించాలని, పూర్తి సమాచారం, సందేహాల నివృత్తి కోసం సమీపంలోని అధ్యయన కేంద్రాల్లో సంప్రదించాలని తెలిపారు. డిగ్రీ, పీజీ పూర్వ విద్యార్థులు రెండు, మూడో సంవత్సరంలో సకాలంలో ఫీజులు చెల్లించలేకపోయిన వారు 2015 – 16 నుంచి 2023 – 24 వరకు అడ్మిషన్లు పొందిన వారు కూడా ఫీజు చెల్లించేందుకు ఈనెల 31 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ వీరన్న, రసాయన శాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ దొడ్డపునేని కోటేశ్వరరావు, అధ్యాపకులు జర్పుల రమేష్, సమ్మయ్య పాల్గొన్నారు.

కనుల పండువగా రామయ్య కల్యాణం

- వేడుకగా ఉట్ల పండుగ
- భారీగా హాజరైన భక్తులు



ఉట్టి కొట్టే వేడుకలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో బుధవారం స్వామివారికి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

వేడుకగా ఉట్ల పండుగ

దేవస్థానం ఆధ్వర్యంలో రామాలయ ప్రాంగణంలో బుధవారం ఉట్ల పండుగను వేడుకగా జరిపారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం ఆలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు జరిగిన మరుసటి రోజున ఉట్టి కొట్టే పండుగను జరపటం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఆలయ సిబ్బంది, యాదవ సోదరులు అందరూ రంగు నీళ్లను చల్లుకుంటూ ఆనందోత్సవాలతో కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రీడా రంగానికి గ్రహణం...

- సౌకర్యాలున్నా శిక్షకులు లేక ఇక్కట్లు
- కొన్ని అంశాల్లోనే జాతీయస్థాయి గుర్తింపు
- జిల్లాలో ఈ ఏడాది తగ్గిన పోటీలు
- పట్టించుకోని క్రీడా సంఘాలు

నేడు జాతీయ క్రీడా దినోత్సవం

ఖమ్మం స్పోర్ట్స్: 'అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని' చందంగా తయారైంది జిల్లా క్రీడారంగ పరిస్థితి. మౌలిక సదుపాయాలు ఆశాజనకంగానే ఉన్నా ఆశించిన మేర క్రీడాభివృద్ధి జరగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మౌలిక వసతుల కల్పనలో జిల్లా క్రీడా శాఖ రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచింది. జిల్లా కేంద్రంతో పాటు కల్లూరు, వైరా, మధిర, లచ్చగూడెం(చింతకాని)లో మినీ స్టేడియాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే వివిధ క్రీడాంశాల్లో సాధన చేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. ఎలాంటి సౌకర్యాలు లేనప్పుడే జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెరిసిన క్రీడాకారులు ఉండగా.. ప్రస్తుతం ఎవరూ క్రీడల పట్ల ఆసక్తి చూపడం లేదని సీనియర్ క్రీడాకారులు అంటున్నారు. జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో 15 క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నా.. క్రీడాకారులు జాతీయస్థాయిలో అంతగా రాణించడం లేదు. ఇక జిల్లాలో నిర్మించిన స్టేడియాల్లో కోచ్‌లు లేక నిరుపయోగంగా ఉంటున్నాయి. ఇప్పటికైనా జిల్లాలోని క్రీడా సంఘాలు పటిష్ట కార్యాచరణ రూపొందిస్తే తప్ప క్రీడారంగంలో ఆశించిన ఫలితాలు వచ్చే పరిస్థితి లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పల్లెలకు దూరమవుతున్న క్రీడలు..

గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటే క్రీడాకారులు ఉండేవారు. అలాంటిది ప్రస్తుతం అక్కడ ఆటలు ఆడేవారే కనిపించడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. క్రీడాకారులను మైదానం వరకు తీసుకొస్తున్నామని, కానీ కొద్ది రోజులకే సదరు క్రీడల పట్ల వారు అయిష్టత కనబరుస్తున్నారని, దీంతో జిల్లా క్రీడా జట్లలో ఆశించిన ఫలితాలు రావడం లేదని పీఈటీలు వాపోతున్నారు. పాఠశాలల్లో క్రీడలను తప్పనిసరి చేస్తేనే మార్పు వస్తుందని అంటున్నారు.



ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియం

స్పోర్ట్స్ అథారిటీ బలోపేతం కావాలి



క్రీడలు అభివృద్ధి చెందాలంటే స్పోర్ట్స్ అథారిటీ బలోపేతం కావాలి. అప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి. రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ వస్తున్న తరుణంలో స్పోర్ట్స్ అథారిటీలకు మరిన్ని నిధులు కేటాయించాలి. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి వెళ్లాలంటే శిక్షకులతోనే సాధ్యం. శిక్షకులు లేకుండా క్రీడాభివృద్ధి జరగడం కష్టం.

– పుట్టా శంకరయ్య, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు

మినీ స్టేడియాల్లో కోచ్‌లను నియమించాలి



జిల్లాలోని అన్ని మినీ స్టేడియాల్లో కోచ్‌లను నియమించాలి. చిన్న దేశాలు సైతం ఒలింపిక్స్‌లో పతకాలు సాధిస్తున్నాయంటే కోచ్‌ల నియామకం, దీర్ఘకాలిక శిక్షణతోనే సాధ్యం. జిల్లాలో గతంలో ఒక్క స్టేడియమే ఉండేది. ప్రస్తుతం ఆరు మినీ స్టేడియాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది.

– ఎండీ.గౌస్, సీనియర్ అథ్లెటిక్స్ కోచ్

సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటున్నాం



జిల్లాలో మినీ స్టేడియాలతో పాటు సర్దార్ పటేల్ స్టేడియంలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటున్నాం. అయితే స్పోర్ట్స్ అథారిటీ నూతనంగా నిర్మించే వాటిలో కూడా కోచ్‌లను నియమించేలా ప్రయత్నిస్తున్నాం. ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోయినా క్రీడాకారులు నిత్యం శిక్షణ పొందేలా చర్యలు చేపడుతున్నాం. జాతీయ క్రీడా దినోత్సవంలో ఈసారి ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడంతో ఎక్కువ మంది పాల్గొంటున్నారు.

– టి.సునీల్‌కుమార్‌రెడ్డి, డీవైఎస్ఓ

క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్

కూసుమంచి: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ భోజన తయారీదారులకు సూచించారు. బుధవారం కూసుమంచిలోని ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన మధ్యాహ్న భోజనంతో పాటు సరుకులు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనంలో తాజా కూరగాయలను వినియోగించాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన అదనపు కలెక్టర్ వారి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాలు అర్థం కాకపోతే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని చెప్పారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతపై స్పందిస్తూ రెండు రోజుల్లో అవసరమైన ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈఓ సోమశేఖరశర్మ, ఎంఈఓ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విక్రమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో పాయింట్ ప్రారంభం



కార్గో లాజిస్టిక్స్ పాయింట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: టీజీఎస్ ఆర్టీసీ కార్గో లాజిస్టిక్స్ సేవలను ఖమ్మం నగరంలో విస్తరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నగరంలోని గాంధీచౌక్‌లో ఆర్టీసీ కార్గో లాజిస్టిక్స్ సేవలను వర్తక సంఘం అధ్యక్షులు చిన్ని కృష్ణారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్గో అందిస్తున్న సేవలను వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని, ఈ ప్రాంత ప్రజలు తమ పార్సిళ్లను ఇక్కడి నుంచే పంపించవచ్చని అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు కార్గో సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో గాంధీచౌక్ లాజిస్టిక్ ఏజెంట్ పి.ప్రతాప్, లాజిస్టిక్స్ ఎగ్జిక్యూటివ్ బి.వీరభద్రం, కె.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను తగలపెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

ఖమ్మంక్రైం: నగరంలోని వన్‌టౌన్ పరిధిలో ఇంటి ముందు ఉన్న ఆటోను గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి తగలపెట్టిన ఘటన మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకుంది. నిజాంపేటలో నివాసం ఉంటున్న సాయి.. తన ఆటోను ఎప్పటిలాగే ఇంటి ఎదుట పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆటోపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఒక్కసారే మంటలు చెలరేగడంతో ఇంట్లో నుంచి బయటకు వచ్చినవారు, స్థానికుల సాయంతో మంటలు ఆర్పివేశారు. అయితే, కొద్ది రోజుల కిందట అదే ప్రాంతంలో నివాసముంటున్న స్వప్న.. తన కుమారుడిని తన అత్త విక్రయించేందుకు యత్నిస్తోందని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గొడవ కాస్తా ఉద్రిక్తతకు దారి తీసిన విషయం విదితమే. ఆ గొడవలో స్వప్నకు ఆటో యజమానులు అయిన సాయి, స్వాతి దంపతులు తోడుగా నిలిచారు. ఇది మనసులో పెట్టుకోని ఓ రాజకీయ నాయకుడు తమ ఆటోను తగుల పెట్టారని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


గుర్తింపుపత్రం ఇవ్వండి..

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక సంఘం ఎన్నికల నిబంధనల ప్రకారం ఎన్నికలు జరిగిన 45 రోజుల్లో గుర్తింపుపత్రం అందజేయాలని, లేదా ఎన్నికలు తిరిగి నిర్వహించాలని టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ వైస్ ప్రెసిడెంట్ కూసన వీరబద్రయ్య బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సింగరేణిలో ఎన్నికలు జరిగి సుమారు ఎనిమిది నెలలవుతున్నప్పటికీ గుర్తింపుపత్రం ఇవ్వని కారణంగా ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు కార్మికుల సమస్యలను గాలికొదిలేశారని పేర్కొన్నారు.

నర్సరీలను పరిశీలించిన భద్రాద్రి డీఆర్డీఓ

సుజాతనగర్: మండలంలోని లక్ష్మీదేవిపల్లి, మంగపేట, సుజాతనగర్‌లలో ఏర్పాటు చేసిన నర్సరీ, జామ, మునగ తోటలను డీఆర్డీఓ విద్యాచందన బుధవారం పరిశీలించారు. నర్సరీ, పండ్లతోటల్లో పర్యటించి మొక్కల పెరుగుదలకు సంబంధించి అధికారులకు పలు సూచనలిచ్చారు. మొక్కలు చనిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే, పల్లె ప్రకృతి వనాలను గ్రామాల్లోని ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, వాటిని సంరక్షించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బానోత్ భారతి, ఏపీఓ చందర్, ఈసీ హరినాథ్, టీఏ అలీ పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,828

వామ్మో.. ఒంటి నొప్పులు..

- జ్వరం తగ్గినా వదలని నీరసం, నొప్పుల తీవ్రత
- కూర్చుంటే మరొకరి సాయంతో లేవాల్సిన దుస్థితి
- తాళలేక ఆస్పత్రిలో చేరుతున్న పీడితులు



వైరా ప్రభుత్వాస్పత్రిలో మహిళకు సెలైన్ పెట్టిన దృశ్యం

వైరా: కూర్చుంటే.. లేవలేక పోతున్నారు. నడుద్దామంటే నడక రావడం లేదు. జాయింట్లు, కీళ్లు, ఒంటి నొప్పులతో ఎందరో అవస్థ పడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో జ్వరాల బారినపడిన వారి పరిస్థితి ఇలా ఉంది. జ్వరం తగ్గినప్పటికీ నొప్పుల తీవ్రత వదలడం లేదు. ఇటీవలి కాలంలో భారీగా వర్షాలు కురవడంతో విషజ్వరాలు విపరీతంగా ప్రబలాయి. దీంతో ఇంటికి ఇద్దరు, ముగ్గురు చొప్పున ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కీళ్లు, ఒళ్లు నొప్పులు, కాళ్ల వాపులు తగ్గకపోవడంతో చికిత్స కోసం మళ్లీ ఆస్పత్రి బాట పడుతున్నారు. బాధ భరించలేక కొందరు ఆస్పత్రుల్లోనే ఇన్‌పేషంట్లుగా చేరుతుండగా మరికొందరు గ్రామీణ వైద్యుల వద్దనే చికిత్స పొందుతున్నారు.

నెలరోజులుగా జ్వరాలే..

నెల రోజులుగా వైరల్ జ్వరాలతో జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వీటిని అరికట్టేందుకు వైద్యారోగ్యశాఖ కనీస చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారే ఇప్పటి వరకు సుమారు 40 వేలకు పైగా ఉంటే ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారు అంతకు మూడింతలు ఉన్నట్లు తెలుస్తోంది. వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజుకు 200 మంది జ్వరాల బారిన పడినవారే వస్తున్నారని అక్కడి వైద్యులు చెబుతుండటం గమనార్హం. పెరుగుతున్న జ్వర పీడితుల దృష్ట్యా ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయడంతో పాటుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పెరుగుతున్న మూఢనమ్మకాలు..

పట్టణ ప్రాంతాల్లో జ్వరపీడితులు ఒళ్లు నొప్పుల బాధ భరించలేక వివిధ రూపాల్లో చికిత్స పొందుతుంటే మారుమూల గ్రామాల్లో బాధితుల పరిస్థితి మరోరకంగా ఉంది. జ్వరాలు తగ్గి నెలలు గడుస్తున్నా కానీ నొప్పులు తగ్గకపోవడంతో కొందరు కుల దేవతలకు మేకలను, కోళ్లను బలిస్తున్నారు. మరికొందరు భూత వైద్యులను సంప్రదించి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మున్సిపల్, వైద్యారోగ్యశాఖ అధికారులు పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

మంచానికే పరిమితం

జ్వరం తగ్గి రెండు నెలలు గడిచినా కాళ్ల వాపులు, కీళ్లు, ఒళ్లు నొప్పులు తగ్గకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. నొప్పుల తీవ్రత అధికంగా ఉండటంతో నెలల తరబడి మంచానికే పరిమితం కావాల్సి వస్తోంది. ఫలితంగా ఏ పని సొంతంగా చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. నొప్పుల బాధను తట్టుకోలేక ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ఏది రాస్తే ఆ మందులు వాడుతున్నారు.

కొన్ని రోజుల వరకు ఉంటుంది



డెంగీ, చికున్ గున్యా, వైరల్ జ్వరాలు వచ్చి తగ్గిపోయాక కూడా ఇన్‌ఫెక్షన్, విష ప్రభావం కొన్ని రోజుల వరకు శరీరంలో ఉంటుంది. కీళ్లు, ఒళ్లు నొప్పులు ఒకేసారి తగ్గవు. క్రమేపీ తగ్గుకుంటూ వస్తుంటాయి. శరీరంలో ఉన్న రోగనిరోధక శక్తిని బట్టి నొప్పులు తగ్గుతుంటాయి. ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి. విశ్రాంతి ఎక్కువగా తీసుకోవాలని, వైద్య నిపుణులు రాసిన మందులే వాడాలి.

– వరికూటి సుబ్బారావు, డీఎంహెచ్‌ఓ

పనులు చేసుకునే పరిస్థితి లేదు..

వారం రోజులుగా తీవ్ర జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులు ఎక్కువవుతున్నాయి. జ్వరం తగ్గినా నొప్పులు తగ్గే పరిస్థితి లేదు. కనీసం పనులు చేసుకునే ఓపిక కూడా లేదు. నిల్చుంటే కూర్చులేకపోతున్నాను. కూర్చుంటే లేవడానికి తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది.

–బి.రాంబాబు, వైరా

అతి వేగం ప్రాణం తీసింది

- ఐస్‌క్రీం బండిని ఢీకొట్టిన కారు
- భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు
- ఖమ్మంరూరల్ మండలం ఎంవీ పాలెంలో విషాదం



నిదిగొండ భిక్షం (ఫైల్)



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వరలక్ష్మి

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలోని శ్రీ మారెమ్మతల్లి ఆలయం సమీపంలో ఖమ్మం – మహబూబాబాద్ రహదారిపై ఓ కారు వేగంగా దూసుకొచ్చి ఐస్‌క్రీమ్ బండిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో భర్త మృతిచెందగా, భార్య తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఆస్ట్రేలియాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న రవికుమార్ ఖమ్మం రూరల్ మండలంలోని వెంకటాద్రినగర్‌లో బంధువుల ఇంటికి వచ్చాడు. బుధవారం అతిగా మద్యం తాగి, కారును వేగంగా నడపుతూ మహబూబాబాద్ వైపు వెళ్తుండగా మారెమ్మగుడి సమీపంలో ముందుగా రోడ్డు పక్కన నిలిపి ఉన్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టాడు. తర్వాత అదే వేగంతో రహదారి పక్కన ఐస్‌క్రీమ్ అమ్ముతున్న ఎం.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన నిదిగొండ భిక్షం (50), ఆయన భార్య వరలక్ష్మిని ఢీకొట్టాడు. దీంతో దంపతులిద్దరూ ఎగిరిపడగా, స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు చేరుకుని క్షతగాత్రులను ఖమ్మంలోని వేర్వేరు ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. చికిత్స పొందుతూ భిక్షం మృతిచెందగా, వరలక్ష్మి పరిస్థితి విషమంగా ఉంది. దంపతులిద్దరూ ఓ ఫంక్షన్ హాల్‌లో కూలీలుగా పని చేస్తూ, ఖాళీ సమయాల్లో ఐస్‌క్రీమ్ అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ ఘటనతో వారి స్వగ్రామమైన ఎంవీ పాలెంలో విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రవికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం రూరల్ ఎస్‌ఐ రామారావు తెలిపారు.

ప్రభుత్వ స్థల ఆక్రమణదారులపై కేసు

మధిర: మధిరలోని వైరా రోడ్డులో గతంలో ఉన్న మధిర రూరల్ పోలీస్ స్టేషన్ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్న ముగ్గురిపై బుధవారం మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. డీసీఎంఎస్‌కు చెందిన స్థలానికి కొన్నాళ్ల క్రితం బహిరంగ వేలంపాట నిర్వహించగా జిలుగుమాడు గ్రామానికి చెందిన వీరంశెట్టి కాశేశ్వరరావు, మధిరకు చెందిన పూసపాటి ఉమామహేశ్వరరావు, మందడపు రామారావు కొంత ప్రభుత్వ స్థలాన్ని దక్కించుకున్నారు. ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా మిగిలిన డీసీఎంఎస్ స్థలాన్ని సైతం కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలు మొదలుపెట్టారు. ఈ విషయమై పరిశీలించిన డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ కొండా సందీప్ కుమార్ ఫిర్యాదుతో ముగ్గురిపై మధిర టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో యువత వీరంగం

నేలకొండపల్లి: పేకాట ఆడుతున్న సందర్భంలో అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. దీంతో వారు వీరంగం సృష్టించటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం అర్ధరాత్రి మండల కేంద్రంలో కొందరు మద్యం సేవించి, పేకాట ఆడుతున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం మొదలై తీవ్రరూపం దాల్చడంతో వారు రోడ్డుపైకి అరుపులు, కేకల మధ్య బాహాబాహీకి పాల్పడ్డారు. వారి ప్రవర్తన ఇబ్బంది కలిగించడంతో స్థానికులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు కొందరు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమచారం.

ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలి

ఆర్టీసీ ఈడీ వినోద్ కుమార్




ఆర్టీసీ డిపోలో పరిశీలిస్తున్న ఈడీ వినోద్‌కుమార్

చుంచుపల్లి: డిపోల వారీగా ఆదాయ మార్గాలపై అధికారులు దృష్టి సారించాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.వినోద్ కుమార్ అన్నారు. బుధవారం కొత్తగూడెం వచ్చిన ఆయన మొదట జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కొత్తగూడెం డిపోలో మొక్కను నాటారు. డిపోలోని గ్యారేజ్‌తో పాటు ప్రతి విభాగాన్ని పరిశీలించారు. డిపో పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది, వినియోగంలో ఉన్న బస్సులు, పెట్రోల్ బంకుల నిర్వహణ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఆర్టీసీలో డిపోల వారీగా ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషించాలన్నారు. ఆదాయం ఎక్కువ వచ్చే రూట్‌లకు మరిన్ని సర్వీసులను తిప్పాలన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌ఎం ఎ.సరిరామ్, డిప్యూటీ ఆర్‌ఎంలు భవాని ప్రసాద్, పవిత్ర, కొత్తగూడెం ఆర్టీసీ డీఎం దేవేందర్, సిబ్బంది ఉన్నారు.

ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో పోకిరీలు

రాత్రిళ్లు అటుగా మహిళలు, యువతులు వెళ్లలేని పరిస్థితి



గంజాయ్ బ్యాచ్ కూర్చునే గెస్ట్‌హౌస్

అశ్వారావుపేట: స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ గంజాయి ముఠాకు అడ్డాగా మారింది. 24 గంటలూ ప్రహరీలపై కూర్చుని వచ్చి, పోయే వాళ్లని కామెంట్లు చేస్తూ తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తున్నారు. స్థానికంగా ఉండే బాలురు, విద్యార్థులు సాయంత్రం వేళ క్రికెట్ ఆడుకునేందుకు వస్తుంటారు. వారితో ఇబ్బంది లేకున్నా.. రాత్రివేళల్లో ప్రహరీలపై కూర్చుని గంజాయి సేవిస్తూ అటుగా వెళ్లే మహిళలు, యువతులు, బాలికలను కామెంట్లు చేస్తూ తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తున్నారు. ట్యూషన్ నుంచి ఇంటికి వెళ్లే విద్యార్థులపై సెల్‌ఫోన్ టార్చ్ వేయడం, ఎదురు తిరిగిన విద్యార్థులపై చేయి చేసుకోవడం తరచుగా జరుగుతోంది. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ రోడ్డుకు ఇరువైపులా నివసించేవారు, అద్దెకు ఉండే వారు ఉద్యోగులు, రైతులు, ఇతరులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడానికి వెనుకాడు తున్నారు. దీంతో గంజాయి సేవించే వారి ఆగడాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. రాత్రి 9 గంటల నుంచి 12 గంటల వరకు గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో గంజాయి సేవిస్తుంటారు. పోలీసులు వచ్చినా చుట్టూ ప్రహరీ ఉండటం.. బ్లూకోల్ట్స్ వాహనానికి సైరన్ ఉండటంతో భవనాల వెనుక నక్కి ఉండి ఆ తర్వాత వారి పని కానిస్తున్నారు. గంజాయి మత్తులో సోమవారం రాత్రి అదే ప్రాంగణంలో భారీ గొడవ జరిగినట్లు తెలుస్తోంది. గెస్ట్‌హౌస్‌కు ఎదురుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పక్కనే ఓ ప్రైవేట్ పాఠశాల, మరోపక్క గ్రామపంచాయతీ కార్యాలయం ఉన్నాయి. ఈ విషయాన్ని ఎస్‌ఐ శివరామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లగా ఇప్పటి వరకు తన దృష్టికి రాలేదని.. పెట్రోలింగ్ నిర్వహించి తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తండ్రిని చంపిన కుమారుడి అరెస్ట్

మణుగూరుటౌన్: పగిడేరు గ్రామంలోని మేకల (కొర్సా) బుచ్చిరాములును కర్రలతో కొట్టి చంపిన కుమారుడు సూర్యంను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ సతీశ్‌కుమార్ వెల్లడించారు. సూర్యంకు 20 ఏళ్ల కిందట బయ్యారం మండలం బోటుగూడెంనకు చెందిన మహిళతో పెళ్లి జరిగింది. కొన్ని కారణాలరీత్యా 8 ఏళ్ల కిందట ఆమె పుట్టింటికి వెళ్లింది. మద్యానికి బానిసైన నిందితుడు తల్లిదండ్రుల ఆస్తిలోని ఆరు ఎకరాల్లో వాటా ఇవ్వాలని గొడవ పడుతున్నాడు. దీనికి నిరాకరించిన తండ్రి మనవరాళ్లకి, మనవడికి సమానభాగం ఇస్తానని చెబుతుండటంతో తండ్రిని చంపితే ఆస్తి మొత్తం తనదవుతుందని భావించి సూర్యం పథకం ప్రకారం పొలం వద్ద పనులు చేసుకుంటున్న తండ్రి బుచ్చిరాములును మంగళవారం మధ్యాహ్నం కర్రలతో కొట్టి హతమార్చి భయంతో పారిపోయాడని సీఐ చెప్పారు. పేరంటాలచెరువు సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించామని ఆయన వివరించారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి



ధర్నా చేస్తున్న మాస్‌లైన్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2 లక్షలు రైతు రుణమాఫీ చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో విధించని ఆంక్షలు, పెట్టని షరతులు ఇప్పుడు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ చేయాలని, రైతు బీమా, పంటలకు రూ.500 బోనస్ వంటి వాటిపై ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలన్నింటినీ ఆంక్షలు లేకుండా అమలు చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చి 100 రోజుల్లో హామీలన్నీ అమలుపరుస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 300 రోజులు పూర్తయినా ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదని, ఆగస్టు 15 నాటికి రూ.2 లక్షల లోపు రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేస్తామని చెప్పినా అది కూడా పూర్తికాలేదన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కోలేటి నాగేశ్వరరావు, బందెల వెంకయ్య, పాశం అప్పారావు, కేలోతు లక్ష్మణ్, మారుతి మల్లయ్య, ధరావత్ లక్ష్మణ్, నవీన్, తేజ, అర్జున్‌రావు, పుల్లయ్య, ఝాన్సీ, ఆవుల మంగతాయి, దేవల తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా, బీమా అమలు చేయాలి

రైతు భరోసా, సమగ్ర పంటల బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమై నాలుగు నెలలు అవుతున్నా ప్రభుత్వం పథకాలు అమలు చేయటంలో విఫలమైందన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం తెచ్చిన కిసాన్ సమ్మాన్ యోజన రైతులకు ఉపయోగపడక పోగా, కంపెనీలకు లాభాలు తెచ్చి పెడుతోందన్నారు. తెలంగాణలో సమగ్ర పంటల బీమా పథకాన్ని రూపొందించాలని ఆయన కోరారు. పార్టీ జిల్లా మహాసభలు డిసెంబర్ రెండో వారంలో సత్తుపల్లిలో జరుగుతాయని పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు వెల్లడించారు. సెప్టెంబర్‌లో శాఖా మహాసభలు పూర్తిచేయాలని, అక్టోబర్‌లో మండలస్థాయి, డిసెంబర్‌లోపు జిల్లా మహాసభలు పూర్తి చేసి, జనవరిలో రాష్ట్ర మహాసభలు సంగారెడ్డి పట్టణంలో నిర్వహించనున్నామని ఆయన వివరించారు. సమావేశంలో పొన్నం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, బండి రమేశ్, వై.విక్రమ్, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, చింతలచెర్వు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నిర్మాణాలను పరిశీలించిన ఆర్డీఓ



కల్వర్టు పక్కనే నిర్మిస్తున్న భవనం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం – వైరా ప్రధాన రోడ్డులోని వెలుగుమట్ల అటవీపార్కు మార్గం సమీపంలో పలు నిర్మాణాలను బుధవారం ఆర్డీఓ గణేశ్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ స్వామి, జలవనరులశాఖ డీఈ ఉదయ్‌ప్రతాప్, ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించారు. గతేడాది ప్రధాన రోడ్డు విస్తరణ సమయంలో ఆర్‌అండ్‌బీ అధికారులు కల్వర్టు నిర్మించారు. ఆర్‌అండ్‌బీ రోడ్డుకు సాగర్ ప్రధాన కాల్వ మధ్యలోని ప్రైవేట్ భూమిలో యజమాని భవనం నిర్మించారు. దీంతో కల్వర్టు పూర్తిగా మూసుకుపోయింది. ఫిర్యాదులు రావడంతో జేసీ సూచనల మేరకు అధికారులు పరిశీలించగా.. కల్వర్టుకు ఇరువైపులా ప్రభుత్వ భూమి లే కపోగా రోడ్డును కూడా ప్రైవేట్ స్థలం (భూసేకరణ) లోనే నిర్మించారని అధికారులు చెబుతున్నారు. అక్క డ కల్వర్టు నిర్మిస్తే వరద నీరు ఎటు వెళ్లాలనే స్పష్టత లేక, అధికారులు అయోమయానికి గురయ్యారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని చెప్పారు.

ఉత్సాహంగా ఉద్యోగుల క్రీడాపోటీలు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనాల్ శ్రేష్ట

ఖమ్మంస్పోర్ట్స్: హాకీ మాంత్రికుడు, దివంగత మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని బుధవారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన పురుషులు, మహిళలు పాల్గొనగా పోటీలను అడిషనల్ కలెక్టర్ శ్రీనాల్ శ్రేష్ట ప్రారంభించారు. హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని ఏటా ఇలాగే జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ తుంబూరు సునీల్‌రెడ్డి, టీజీఓ అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ, కార్యదర్శి వేలాద్రి, టీఎన్‌జీవోస్ అడహక్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాసరావు, కోచ్‌లు ఎండీ గౌస్, ఎండీ అక్బర్, అలీ, సాంబమూర్తి, సురేశ్, మతిన్ పాల్గొన్నారు. పురుషులు, మహిళలకు నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి గురువారం బహుమతులు అందజేస్తామని డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి తెలిపారు.



టెన్నీకాయిట్ ఆడుతున్న మహిళలు



చెస్ పోటీల్లో పాల్గొన్న ఉద్యోగులు

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

బోనకల్: మండలంలోని మోటమర్రి – బోనకల్ రైల్వే స్టేషన్ మధ్య గల జగ్గయ్యపేట వైపు వెళ్లే బైపాస్ క్యాబిన్ వద్ద బుధవారం సుమారు 40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు, ఆధార్‌కార్డు కనిపించలేదు. నీలం రంగు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉంచినట్లు రైల్వే ఎస్‌ఐ భాస్కర్‌రావు తెలిపారు.


చికిత్స పొందుతున్న యువకుడు...

ఖమ్మంక్రైం: ఓ మహిళ పెళ్లి చేసుకోవాలని వేధించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగుమందు తాగి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. సీఐ రమేశ్ కథనం ప్రకారం.. చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన మంద రామారావు (27) నగరంలోని వీడీవోస్ కాలనీలో ఉంటూ ఓ బేకరిలో పనిచేస్తున్నాడు. అతనికి అక్కడ ఓ వివాహితతో పరిచయమైంది. ఆమె అప్పటికే రెండు పెళ్లిళ్లు చేసుకొని విడాకులు తీసుకుంది. రామారావుతో ఉన్న చనువును ఆసరాగా చేసుకొన్న ఆమె తనను పెళ్లి చేసుకోవాలని వేధించటం ప్రారంభించింది. దీనికి రామారావు ఒప్పుకోకపోవటంతో నాగులవంచలోని అతని ఇంటి వద్దకు వెళ్లి గొడవ చేసింది. దీంతో మనస్తాపం చెందిన ఆయన ఈ నెల 20న ఎస్‌వీఎం పాఠశాల సమీపంలో గడ్డిమందు తాగాడు. ఆయన్ను పలు ప్రైవేట్ ఆస్పత్రులు తిప్పినప్పటికీ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి సోదరి శిరీష ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పాముకాటుతో మహిళ...

దుమ్ముగూడెం: మండలంలోని వైట్‌నాగారం గ్రామానికి చెందిన ఉబ్బ కామమ్మ (30) పాముకాటుకు గురై చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. కామమ్మ భర్త భద్రయ్యతో కలిసి వ్యక్తిగత పనుల నిమిత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లిగూడెంలోని వాళ్ల అమ్మ ఇంటికి వెళ్లారు. బుధవారం తెల్లవారుజామున కామమ్మ బయటకు రాగా కట్లపాము కాటువేసింది. గమనించిన కుటుంబ సభ్యులు భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. కామమ్మకు భర్త, ఇద్దరు పిల్లలున్నారు.

కేన్సర్ సోకిందని ఆత్మహత్య



వెంకటేశ్వరరావు (ఫైల్)

ఖమ్మంక్రైం: కేన్సర్ సోకిందని మనస్తాపానికి గురైన ఓ వృద్ధుడు రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం జీఆర్పీ ఎస్‌ఐ భాస్కర్‌రావు వివరాలు వెల్లడించారు. త్రీటౌన్ పరిధిలోని బెస్తకాలనీకి చెందిన దివ్వెల వెంకటేశ్వరరావు (84) ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోగా కేన్సర్ సోకినట్లు తెలింది. తీవ్ర మనోవేదనకు గురైన వెంకటేశ్వరరావు వరంగల్ వైపు వెళ్తున్న షిర్డీ ఎక్స్‌ప్రెస్‌కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు వీరభద్రరావు, కుమార్తె హైదరాబాద్‌లో ఉంటున్నారు. మృతుడి భార్య సైతం అనారోగ్యంతో మంచంపట్టారు. అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

ఎంత జనాభా? ఎన్ని నీళ్లు కావాలి?

- ఇండెంట్ సమర్పించాలన్న కృష్ణా బోర్డు
- తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు లేఖ

సాక్షి, హైదరాబాద్: కృష్ణా బేసిన్‌లోని జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, సాగర్ టెయిల్‌పాండ్, పులిచింతల, ప్రకాశం బరాజ్‌ల పరిధిలో నివాసముంటున్న జనాభా ఎంత? ఆ జనాభా తాగునీటి అవసరాలకు ఎన్ని నీళ్లు అవసరమో ఇండెంట్ సమర్పించాలని తెలుగు రాష్ట్రాలను కృష్ణా బోర్డు కోరింది. ఈ మేరకు కృష్ణా బోర్డు సభ్యుడు ఆర్ఎం శంఖువా తెలంగాణ, ఏపీలకు తాజాగా లేఖ రాశారు. ప్రాజెక్టుల కింద జిల్లాలు, మండలాల వారీగా జనాభా లెక్కలు, తాగునీటి అవసరాలను సెప్టెంబర్ 15లోగా తెలియజేయాలని కోరారు. 2024–25 వానాకాలం పంటల అవసరాలకు శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి 135.5 టీఎంసీలను కేటాయించాలని తెలంగాణ ఇటీవల కోరింది. నల్లగొండ ఎడమ కాల్వ కింద నల్లగొండ సీఈ పరిధిలో తాగునీటికి 1.5 టీఎంసీలు, సాగునీటికి 15.5 టీఎంసీలు, సూర్యాపేట సీఈ కింద సాగునీటికి 18 టీఎంసీలు, ఖమ్మం సీఈ కింద తాగునీటికి 3.78 టీఎంసీలు, సాగునీటికి 31.72 టీఎంసీలు, ఎమ్మార్పీ హైలెవల్ కెనాల్, లో లెవల్ కాలువల కింద తాగునీటికి 7.5 టీఎంసీలు, సాగునీటికి 24 టీఎంసీలు, శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కల్వకుర్తి లిఫ్టుకు 31.1 టీఎంసీలు సాగునీటికి, 2.4 టీఎంసీలు తాగునీటికి కేటాయించాలని కోరుతూ తెలంగాణ ఇండెంట్ సమర్పించింది.

నెబ్రాస్కాలో దీపావళి పండుగకు అధికారిక గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: నెబ్రాస్కా గవర్నర్ జిమ్ పిల్లెన్ కార్యాలయం భారతీయ పండుగ దీపావళిని అధికారికంగా గుర్తించింది. అక్టోబర్ 28 నుంచి నవంబర్ 2 వరకు దీపావళి వారంగా ప్రకటించింది. అంతేకాకుండా నెబ్రాస్కా రాష్ట్రంలో అక్టోబర్ నెలను హిందూ వారసత్వ నెలగా గుర్తించారు. పురాతన హిందూ సాంస్కృతిక వారసత్వం, సనాతన ధర్మం, సంప్రదాయాలను సంరక్షించడానికి అమెరికాలోని భారతీయ హిందూ సమాజం చేసిన గణనీయమైన కృషి కారణంగా ఈ గుర్తింపు సాధ్యమైంది. నెబ్రాస్కాలోని హిందువులు దీపావళిని ఘనంగా జరుపుకోవాలని అక్కడి హిందూ నాయకులు కోరారు. ఈ సందర్భంగా దీపావళి విశిష్టతను తెలిపిన డాక్టర్ ఫణి తేజ్ అడిదమ్‌కు హిందూ సమాజం తరపున వారు ధన్యవాదాలు తెలిపారు.



ఏపీ రాష్ట్ర హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు ప్రమాణం చేశారు. బుధవారం హైకోర్టులో జరిగిన కార్యక్రమంలో వీరిద్దరితో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు.

మూత‘బడి’నది!



తాళం వేసిన బడి మెట్లపై కూర్చున్న విద్యార్థులు

కౌటాల(సిర్పూర్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం మొగడ్‌దగడ్‌లోని గిరిజన ఏకోపాధ్యాయ ప్రాథ మిక పాఠశాలలో 25 మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయిని సుశీల ఇటీవల బదిలీపై వెళ్లగా.. మరో టీచర్‌ను కేటాయించలేదు. దీంతో వారం రోజులుగా బడి తలుపులు తెరుచుకోవడం లేదు. విద్యార్థులంతా బుధవారం ఉదయం తొమ్మిది గంటలకే పాఠశాలకు చేరుకున్నారు. తాళం వేసి ఉండటంతో అక్కడే కాసేపు ఆడుకుని ఇళ్లకు తిరిగి వెళ్లారు. దీనిపై స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్‌పర్సన్ మడావి పోచానిని వివరణ కోరగా.. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో టీచర్లను సర్దుబాటు చేస్తారని తెలిపారు.

రూ.1,226 కోట్లతో.. పోలవరం ఎడమ కాలువకు ‘లిఫ్ట్’

- రేషన్ డోర్ డెలివరీ రద్దు.. కొత్తగా 2,774 రేషన్ షాపుల ఏర్పాటు
- రివర్స్ టెండర్ల విధానానికీ మంగళం
- ఏపీ కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి కొలుసు పార్థసారథి

సాక్షి, అమరావతి: పోలవరం ఎడమ కాలువకు లిఫ్ట్ ద్వారా నీటిని తోడిపోయడం ద్వారా ఉత్తరాంధ్ర తాగు, పారిశ్రామిక అవసరాలను తీర్చాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం రూ.1,226.68 కోట్లతో ఎడవ కాలువ పనులు పూర్తిచేయాలనే ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసింది. సచివాలయంలో బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశ వివరాలను సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు. విశాఖపట్నానికి లిఫ్ట్ విధానంలో ముందుగా నీరు అందించి, పోలవరం పూర్తయిన తర్వాత గ్రావిటీ ద్వారా పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన రివర్స్ టెండర్ విధానం రద్దుచేసి పాత విధానంలోనే టెండర్లు పిలిచే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. గత ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ కోసం విడుదల చేసిన జీఓ–67ను రద్దుచేయడంతోపాటు అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లలోని పనులను రివర్స్ టెండరింగ్‌కు బదులుగా సంప్రదాయ టెండర్ ప్రక్రియను అమలుచేయనున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే గత ప్రభుత్వం అమలుచేసిన రేషన్ డోర్ డెలివరీ విధానం రద్దుచేసి దాని స్థానంలో కొత్తగా 2,774 రేషన్ దుకాణాల ఏర్పాటుకు కేబినెట్ నిర్ణయం తీసుకుందని పార్థసారథి చెప్పారు. ఇక పట్టాదారు పాసుపుస్తకాలపై జగన్ పేరు, బొమ్మలు, రాజకీయ పార్టీల లోగో తొలగించి దాని స్థానంలో రాజముద్రను ముద్రించి 21.86 లక్షల పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడానికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు.

పోలవరం ప్రాజెక్టుకు రూ.12 వేల కోట్లు ఆమోదం!

- సవరించిన అంచనాలకు గ్రీన్ సిగ్నల్
- కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్న కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు
- అధికారిక మీడియా సమావేశంలో ప్రస్తావించని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టుకు రూ.12,127 కోట్లు ఇచ్చేందుకు కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ఈమేరకు జలశక్తి శాఖకు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన సవరించిన అంచనాలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని కేబినెట్ సమావేశం అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు మీడియాకు తెలిపారు. కొత్త డయాఫ్రమ్ వాల్ సహా పెరిగిన అంచనా వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. డబుల్ ఇంజన్ గ్రోత్ ఓరియెంటెడ్ ప్రభుత్వం కారణంగా ఇది సాధ్యమైందని చెప్పారు. అయితే, కేంద్ర కేబినెట్ నిర్ణయాలు తెలిపేందుకు ఏర్పాటు చేసిన అధికారిక మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పోలవరం ప్రాజెక్టును ప్రస్తావించకపోవడం గమనార్హం.

జాయింట్ సర్వే!

పోలవరం ముంపుపై తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు సీడబ్ల్యూసీ చైర్మన్ ఆదేశం

- 150 అడుగుల ఎఫ్ఆర్ఎల్‌తో ఉండే ప్రభావంపై అధ్యయనం చేయాలి
- క్షేత్రస్థాయిలో ముర్రెడువాగు, కిన్నెరసాని వాగుల ముంపుపై డీమార్కింగ్ చేయాలి
- ముంపు గుర్తించిన తర్వాత నివారణ చర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టులో 150 అడుగుల గరిష్ట నీటిమట్టం (ఎఫ్ఆర్ఎల్) మేరకు నీళ్లను నిల్వ చేస్తే తెలంగాణ భూభాగంలో ఏర్పడనున్న ముంపు ప్రభావంపై పోలవరం ప్రాజెక్టు ఆథారిటీ (పీపీఏ) ఆధ్వర్యంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో తక్షణమే జాయింట్ సర్వే నిర్వహించాలని కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్ సింగ్ వోరా ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టుతో కిన్నెరసాని, ముర్రెడువాగులకు ఏర్పడనున్న ముంపుపై ఎన్జీటీ ఆదేశాల మేరకు ఇప్పటికే జాయింట్ సర్వే నిర్వహించగా, తదుపరిగా క్షేత్రస్థాయిలో ముంపు ప్రాంతాన్ని గుర్తిస్తూ డీమార్కింగ్ చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాలతో తక్షణమే జాయింట్ సర్వే నిర్వహించి డీమార్కింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని వోరా ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావానికి సంబంధించి తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాల అభ్యంతరాలపై బుధవారం ఢిల్లీలోని సీడబ్ల్యూసీ కార్యాలయంలో వోరా అధ్యక్షతన సాంకేతిక కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నీటిపారుదల శాఖ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఎప్పటికైనా సర్వే చేయాల్సిందే: వోరా

పోలవరం ప్రాజెక్టు ఎఫ్ఆర్ఎల్ ఎప్పటికైనా 150 అడుగులే ఉంటుందని, దీనివల్ల తెలంగాణలో ఉండనున్న ముంపు ప్రభావంపై ఎప్పుడైనా సర్వే చేసి నివారణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని సీడబ్ల్యూసీ చైర్మన్ వోరా స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సర్వే జరగకపోవచ్చని, ఇప్పుడు రాష్ట్ర విభజన జరిగిన నేపథ్యంలో తెలంగాణ కోరిన మేరకు జాయింట్ సర్వే చేయాల్సిందేనని సూచించారు. జాయింట్ సర్వేను సమన్వయం చేయాలని పీపీఏను ఆదేశించారు. 150 అడుగుల నిల్వతో ఏర్పడే ముంపుతో పాటు ప్రాజెక్టు కారణంగా ముర్రెడువాగు, కిన్నెరసాని వాగులకు ఉండే ముంపును గుర్తించి నివేదిక సమర్పిస్తే, ముంపు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఏపీ, తెలంగాణతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. తెలంగాణ కోరిన మేరకు.. పోలవరం ప్రాజెక్టుతో మిగిలిన 5 వాగులకు ఉండనున్న ముంపుపై జాయింట్ సర్వే విషయంలో మళ్లీ సమావేశమై నిర్ణయం తీసుకుందామని చెప్పారు. కాగా పోలవరం ప్రాజెక్టుతో సీడబ్ల్యూసీ సర్వేలో తేలిన దానికి మించి తమ రాష్ట్రంలో ముంపు ప్రభావం ఉందని ఒడిశా నీటిపారుదల శాఖ సీఈ అశుతోష్ దాస్ పేర్కొన్నారు. ఐఐటీ రూర్కెలా అధ్యయన నివేదికలో ఇది తేలిందన్నారు. ఈ నివేదికపై అధ్యయనం చేసి తదుపరి సమావేశంలో చర్చిస్తామని సీడబ్ల్యూసీ చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం సీఈ మోహన్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్యం, పీపీఏ సీఈఓ అతుల్ జైన్, సీఈ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి పురోగతి లేదు: తెలంగాణ

గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల మేరకు జాయింట్ సర్వేకు ఏపీ ప్రభుత్వం ముందుకు రావడం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ (ఓ అండ్ ఎం) బి.నాగేందర్‌రావు తెలియజేశారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి ఎలాంటి పురోగతి లేదని, కాగితాలకే పరిమితమయ్యాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. 150 అడుగుల ఎఫ్ఆర్ఎల్‌తో తెలంగాణలో 950 ఎకరాలు ముంపునకు గురవుతాయని, దీనిపై జాయింట్ సర్వే చేయాల్సిందేనని ఆయన కోరారు. మరోవైపు జాయింట్ సర్వేకు తెలంగాణ సహకరించడం లేదని, సర్వే రెండు వాగులకే పరిమితం చేయాల్సి ఉండగా, ఏడు వాగులు సర్వే చేయాలని కోరుతోందని ఏపీ అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం సీఈ శ్రీనివాసరావు చెప్పారు. అయితే ముర్రెడువాగు, కిన్నెరసాని వాగుల జాయింట్ సర్వేకు పూర్తిగా సహకరించిన విషయాన్ని తెలంగాణ ఈఎన్సీ గుర్తు చేశారు.

ఖజానాకు కన్నం!

రివర్స్ టెండరింగ్ రద్దుకు ఏపీ కేబినెట్ ఆమోదం

- అంచనాలు పెంచేసి నాడు అధిక ధరలకు కట్టబెట్టిన చంద్రబాబు
- ఆ తర్వాత మొబిలైజేషన్ అడ్వాన్సులు.. కాంట్రాక్టర్ల నుంచి అవే కమీషన్లుగా వసూలు
- ఆ అక్రమ వ్యవహారాలతో ఖజానాపై రూ.20 వేల కోట్లకుపైగా పెనుభారం
- మళ్లీ 2014–19 పాత టెండర్ విధానం అమలుకు కూటమి సర్కారు గ్రీన్ సిగ్నల్
- పట్టిసీమ టెండర్ల అక్రమాలను 2017–18లోనే కడిగేస్తూ కాగ్ నివేదిక
- మళ్లీ ఇప్పుడూ అదే రీతిలో కాంట్రాక్టర్లతో కలిసి ఖజానా దోచేసేందుకు సిద్ధం
- అధికారంలోకి రాగానే టెండర్ల వ్యవస్థను సంస్కరించిన వైఎస్ జగన్
- రూ.వంద కోట్లు అంతకంటే ఎక్కువ విలువైన పనుల టెండర్ జ్యుడీషియల్ ప్రివ్యూకు
- రూ.కోటి అంతకంటే ఎక్కువ విలువైన పనులకు రివర్స్ టెండరింగ్‌లో టెండర్లు
- అత్యంత పారదర్శక టెండర్లలో పాల్గొనేందుకు కాంట్రాక్టర్లు పోటాపోటీ.. కాంట్రాక్టు విలువ కంటే తక్కువకే పనులు చేసేందుకు ముందుకొచ్చిన కాంట్రాక్టర్లు



వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జిల్లా వార్తలు

సింగరేణి క్రీడా క్యాలెండర్ విడుదల

సింగరేణి(కొత్తగూడెం): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సింగరేణి వ్యాప్తంగా ఏరియాల్లో నిర్వహించనున్న క్రీడాపోటీల క్యాలెండర్‌ను ఇటీవల విడుదల చేశారు. అయితే, ఈ జాబితాలో పేర్కొన్న తేదీల్లో కోలిండియా స్థాయి పోటీలను ప్రకటిస్తే షెడ్యూల్‌లో మార్పులు చేస్తామని జీఎం పర్సనల్(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) సామ్యేల్ సుధాకర్ తెలిపారు. ఈమేరకు ఆర్జీ–2 ఏరియాలో సెప్టెంబర్ 17, 18వ తేదీల్లో షటిల్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహిస్తారు. శ్రీరాంపూర్ ఏరియాలో సెప్టెంబర్ 19, 20వ తేదీలలో వాలీబాల్, కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో సెప్టెంబర్ 24, 25వ తేదీలలో బాడీబిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్(మెన్), పవర్ లిఫ్టిగ్ (మెన్ అండ్ ఉమెన్), ఇల్లెందు ఏరియాలో అక్టోబర్ 15, 16 తేదీ ల్లో లాన్ టెన్నిస్, బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించనున్నారు. ఇక ఆర్జీ–1 ఏరియాలో అక్టోబర్ 22, 23వ తేదీల్లో కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్, మందమర్రి ఏరి యాలో నవంబర్ 5, 6వ తేదీలలో ఫుట్‌బాల్, కొత్తగూడెం ఏరియాలో నవంబర్ 12, 13వ తేదీల్లో కల్చ రల్ మీట్, మణుగురు ఏరియాలో నవంబర్ 19, 20వ తేదీల్లో హాకీ, భూపాలపల్లి ఏరియాలో నవంబర్ 26, 27వ తేదీల్లో క్యారమ్స్, చెస్, ఆర్జీ–3 ఏరి యాలో డిసెంబర్ 10, 11వ తేదీలలో అథ్లెటిక్స్, స్విమ్మింగ్, త్రోబాల్(ఉమెన్), బెల్లంపల్లి ఏరియాలో డిసెంబర్ 17నుంచి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు జీఎం తెలిపారు.

‘నవోదయ’ం ఉన్నట్టా.. లేనట్టా?!



ప్రతిపాదిత స్థలం వద్ద రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అప్పటి ఎమ్మెల్యే కాంతారావు (ఫైల్)


- ఏడాది క్రితం 30 ఎకరాల ప్రభుత్వ భూమి గుర్తింపు
- బీజీ కొత్తూరులో రహదారికి శంకుస్థాపన కూడా..
- ఆతర్వాత పురోగతి లేకపోవడంతో నీలినీడలు

అశ్వాపురం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కూసుమంచిలో మాత్రమే నవోదయ విద్యాలయ ఉండగా.. కొత్త జిల్లాలు ఏర్పడ్డాక అది ఖమ్మం జిల్లా పరిధిలోకి వెళ్లిపోయింది. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సైతం నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేయాలన్న డిమాండ్‌తో కేంద్ర ప్రభుత్వం గత ఏడాది రాష్ట్రానికి పలు నవోదయ స్కూళ్లను మంజూరు చేసింది. ఇందులో భాగంగా భద్రాద్రి జిల్లాలోని అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం స్థలం సేకరించి ప్రభుత్వానికి అప్పగించినా ఆ తర్వాత ఎలాంటి పురోగతి లేకపోవడంతో పాఠశాల ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

స్థలసేకరణ.. రోడ్డుకు నిధులు

కేంద్రం నవోదయ విద్యాలయాలను మంజూరు చేశాక.. అశ్వాపురం మండలం మొండికుంట గ్రామ పంచాయతీ పరిధి బీజీ కొత్తూరులో ఏర్పాటుకు నిర్ణయించారు. గత ఏడాది అప్పటి పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, అధికారులు 30 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి ప్రభుత్వానికి అప్పగించారు. దీంతో ఏజెన్సీ ప్రాంతమైన పినపాక నియోజకవర్గంలో కేంద్రప్రభుత్వ పరిధిలోని విద్యాలయ ఏర్పాటవుతుందని విద్యార్థులకు మెరుగైన విద్య అందడమే కాక స్థానికులకు ఉపాధి లభిస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. ఆపై ప్రతిపాదిత స్థలం వరకు సీసీ రోడ్డు నిర్మించేందుకు గత ఏడాది ఆగస్టులో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన రూ.1.50 కోట్ల ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు అప్పట్లోనే శంకుస్థాపన చేసినా పనులు మొదలుకాలేదు. ఇంతలోనే ప్రభుత్వం మారడంతో బీజీ కొత్తూరులో గుర్తించిన ప్రభుత్వ స్థలంలో నవోదయ విద్యాలయ నిర్మిస్తారా, లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై కలెక్టర్‌తో పాటు పాలకులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టి సారించాలి



ఏజెన్సీ ప్రాంతమైన పినపాక నియోజకవర్గానికి నవోదయ విద్యాలయ మంజూరు కాగా అప్పటి ఎమ్మెల్యే రేగా కాంతారావు బీజీ కొత్తూరులో ఏడాది క్రితం స్థలాన్ని గుర్తించారు. ఆపై రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన కూడా చేశారు. అయితే, ఇప్పటివరకు పనులకు మోక్షం లేదు. ప్రస్తుత ప్రభుత్వం, అధికారులు స్పందించి నవోదయ విద్యాలయాన్ని బీజీ కొత్తూరులోనే ఏర్పాటు చేయాలి.

– మర్రి మల్లారెడ్డి, మాజీ సర్పంచ్, మొండికుంట

పెసర, మినుముకు పురుగుల బెడద

- నివారణ చర్యలు చేపట్టాలి
- మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త రుక్మిణీదేవి



మధిర ఏఆర్ఎస్ లో సాగుచేసిన మినుము



పెసరను ఆశించిన తామర పురుగు

మధిర: వర్షాలు కురిసిన తర్వాత బెట్ట పరిస్థితులు ఏర్పడితే పెసర, మినుములో రసం పీల్చే పురుగులు ఆశిస్తాయి. వీటిలో ప్రస్తుతం పూత దశలో ఆశిస్తున్న నల్ల తామర పురుగు, పూతను ఆశించి నష్టం కలుగజేస్తున్న గూడు పురుగులు ముఖ్యమైనవి. వీటి నివారణకు చేపట్టాల్సిన చర్యలను మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణీదేవి, శాస్త్రవేత్త కె.నాగస్వాతి వివరించారు. పెసర, మినుము పూత దశలో ఉన్నప్పుడు నల్ల తామర పురుగులు ఆశించి పూతలోని రసాన్ని పీల్చడంతో రాలిపోయే ప్రమాదం ఉంది. అలా పూత కూడా మాడిపోతుంది. దీని నివారణకు ఫిప్రోనిల్ 1.5 మిల్లీలీటర్లు లేదా స్పైనోసాడ్ 0.3 మిల్లీలీటర్లు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అలాగే ఎకరానికి 10–15 నీలిరంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకుంటే వాటికి తామర పురుగులు అతుక్కొని సంతతి తగ్గే అవకాశం ఉంటుంది. పెసర, మినుము పూత దశలో ఆశించే మరొకటి గూడు పురుగు. దీనినే మారుకా మచ్చల పురుగు అని కూడా పిలుస్తారు. ఈ పురుగు 2 లేదా 3 పువ్వులను గూడుగా చేసి నల్ల బూజుగా మారేలా చేస్తుంది. కాయలు ఏర్పడిన తర్వాత వాటి మీద రంధ్రాలు చేసి గింజలను పూర్తిగా తినేస్తుంది. దీని నివారణకు నొవాల్యూరాన్ ఒక మిల్లీలీటర్ లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మిల్లీలీటర్లు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే క్లోరంట్రానిలిప్రోల్ 0.3 మిల్లీలీటర్లు, వేప నూనె 5 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. అలాగే పెసర, మినుము పూతదశలో పంట బెట్టకు గురైనప్పుడు, భూమిలో ఎక్కువ తేమ ఉన్నప్పుడు పూత రాలిపోయే అవకాశం ఉన్నందున పై మందులతో పాటు పోషక పదార్థాలైన 19:19:19 లేదా 13:0:45 లను 10 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పెసర, మినుములో పల్లాకు తెగులు కూడా వస్తోంది. దీన్ని తెల్లదోమ వ్యాపింప చేస్తుంది. దీని నివారణకు అసిటామాప్రిడ్ 0.3 గ్రాములు లేదా థయోమిథాక్సమ్ 0.3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. ఎకరానికి 10 – 15 పసుపు రంగు జిగురు అట్టలను అమర్చుకోవాలని శాస్త్రవేత్తలు వివరించారు.

ఐదు తరగతులకు ఒక్కరే టీచర్!



పాఠం బోధిస్తున్న టీచర్

అశ్వారావుపేటరూరల్: ఆ పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతుల్లో కలిపి 52 రెండు విద్యార్థులు ఉండగా ఒక్కరే ఉపాధ్యాయురాలు పాఠాలు బోధిస్తున్నారు. అశ్వారావుపేట మండలం పండువారిగూడెంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుంచి ఏడు తరగతులు ఉండగా ఆరు, ఏడో తరగతుల్లో విద్యార్థులెవరూ చేరలేదు. ఇక ఐదో తరగతి వరకు 52మంది విద్యార్థులకు గాను మూడు ఎస్‌జీటీ పోస్టులే ఉన్నాయి. ఇందులో ఒకరు ఇటీవల బదిలీ కాగా ఇంకొకరిని డిప్యూటేషన్‌పై ఇదే మండలం గోగులపూడి పాఠశాలకు కేటాయించారు. ఇక మిగిలిన ఉపాధ్యాయురాలు వి.అనసూయ ప్రతిరోజు ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. విద్యార్థులందరికీ ఒకే ఉపాధ్యాయురాలు విడతల వారీగా, ఒక్కోసారి అందరినీ ఒకేచోట కూర్చోబెట్టి బోధిస్తుండగా.. ఇదిలాగే కొనసాగితే పాఠాలు ఎలా అర్థమవుతాయని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

బొగ్గు రవాణాలో అస్తవ్యస్తం

కోల్ మూమెంట్ ఈడీ లేకపోవడమే కారణం



రైల్వే వ్యాగన్ల ద్వారా రవాణా అవుతున్న బొగ్గు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో సుమారు 50 రోజులుగా బొగ్గు రవాణా అస్తవ్యస్తంగా మారిందని కార్మికులు అంటున్నారు. సంస్థ వ్యాప్తంగా రోజుకు సుమారు రెండు లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తుంది. ఇందులో సుమారు 80 శాతం బొగ్గును రైల్వే వ్యాగన్ల ద్వారా రవాణా చేయాల్సి ఉంటుంది. బొగ్గు రవాణాలో ఏరోజు ఎన్ని వ్యాగన్ల బొగ్గును ఎవరెవరికి పంపించాలి, అందుకు వివిధ కంపెనీలు, విద్యుత్ సంస్థలతో మాట్లాడేందుకు యాజమాన్యం కోల్ మూమెంట్ ఈడీ(ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్)ను నియమించింది. అయితే సదరు అధికారి కాలపరిమితి గత జూన్ 30తో ముగియడంతో తిరిగి మాతృ సంస్థ అయిన రైల్వేకు వెళ్లిపోయారు. నాటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉండడంతో బొగ్గు రవాణా దాదాపు 50 శాతం తగ్గింది. సంస్థ ఉత్పత్తి చేసే బొగ్గులో 80 శాతం అంటే రోజుకు సుమారు 40 రేక్‌లు (రేక్‌కు సుమారు 4 వేల టన్నులు) దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న విద్యుత్, సిమెంట్, పేపర్, గాజు పరిశ్రమలకు రైల్వే ద్వారా రవాణా అయ్యేది. అయితే గత నెల రోజులుగా ఇది 50 శాతానికి పడిపోయింది. ప్రస్తుతం రోజుకు 20 రేక్‌ల(వ్యాగన్ల) బొగ్గు మాత్రమే రవాణా అవుతోందని కార్మికులు అంటున్నారు. సింగరేణి ఉన్నతాధికారులు స్పందించి ఎవరైనా ఒక డైరెక్టర్‌కు కోల్ మూమెంట్ ఈడీగా నియమిస్తే అంతరాయం లేకుండా బొగ్గు రవాణా సజావుగా సాగుతుందని అభిప్రాయపడుతున్నారు.

పాదయాత్రగా తిరుమలకు..



తిరుమలకు కాలినడకన బయలుదేరిన భక్తులు

మధిరరూరల్/వైరారూరల్: తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి మధిర మండలానికి చెందిన పలువురు భక్తులు పాదయాత్రగా తరలివెళ్లారు. జాలిముడి గ్రామానికి చెందిన శీలం కృష్ణారెడ్డి, రామచంద్రాపురం గ్రామానికి చెందిన మార్త నరసింహారావు, వైరా మండలం దాచాపురం నుంచి ఐలూరి శ్రీనివాస్ రెడ్డి, ముక్కర చెన్నారెడ్డి, షేక్ మదార్, గరిడేపల్లి కృష్ణ, ముక్కర వెంకట కృష్ణారెడ్డి, గూడూరు కృష్ణారెడ్డి, శీలం కృష్ణారెడ్డి అనే 9 మంది భక్తులు కృష్ణాష్టమి రోజైన ఈనెల 27న నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం నుంచి పాదయాత్రగా బయలుదేరారు. అక్కడి నుంచి బయలుదేరి జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని తిరిగి కాలినడకన తిరుమలకు తరలి వెళ్లారు. ప్రతీ రెండేళ్లకోసారి తాము ఇలా పాదయాత్రగా తిరుమల వెళ్తున్నట్లు తెలిపారు.

భద్రాద్రి జిల్లాలో నేడు ఎంపీ పర్యటన



రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి గురువారం భద్రాద్రి జిల్లాలో పర్యటించనున్నారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి చంద్రుగొండ, అశ్వారావుపేటలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తారు. ఆ తర్వాత ఖమ్మంలోని తన నివాసంలో పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటారు.